

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 25 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 94 పేజీలు : 4 వెల : రూ


# వరద సాయం అందడంలో తప్పులు జరగకూడదు

### వరద సహాయక చర్యలపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: ఏపీలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల కలెక్టర్లతో బుధవారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు ప్రగతిని సీఎం పరిశీలించారు. నిత్యవసరాల పంపిణీ, వరద బాధిత కుటుంబాలకు అదనంగా రూ.2వేల పంపిణీ, సహాయ శిబిరాలు, విద్యుత్తు?తాగునీటి సరఫరా పునరుద్ధరణ, వైద్య?ఆరోగ్య శిబిరాలు, దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం, గల్లంతైన వ్యక్తుల ఆచూకీ, పశుదాణా పంపిణీ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించారు.అనంతరం అంశాల వారీగా వరద నష్టం నివేదికలను? సహాయ చర్యల్లో ప్రగతిని సీఎంకు అధికారులు వివరించారు. 95,949 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందించే కార్యక్రమం శరవేగంగా చేశామని కలెక్టర్లు తెలిపారు. మొత్తం నాలుగు జిల్లాల్లో 19,832 మందికి మినహా అందరికీ నిత్యావసరాలు అందాయని తెలిపారు. ఈ సాయంత్రంలోగా వీరికి కూడ నిత్యావసరాలు అందిస్తున్నామన్నారు. వరద బాధిత కుటుంబాలకు రూ.2వేల చొప్పున అదనపు సహాయం దాదాపుగా అందిందని వివరించారు. సహాయక శిబిరాల నుంచి ప్రజలంతా తిరిగి ఇళ్లకు వెళ్లారన్నారు.కడపలో 155 గ్రామాలకు విద్యుత్తు అంతరాయం కలిగితే.. అన్నింటికీ పునరుద్ధరించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రాంత సీఎండీ ఇక్కడే ఉండి... విద్యుత్తును పూర్తిగా పునరుద్ధించారని పేర్కొన్నారు. నిన్న మళ్లీ భారీ వర్షం కారణంగా 8 ఆవాసాలకు మాత్రమే విద్యుత్తు పునరుద్ధరణలో ఇబ్బందులు వచ్చాయని, ఈరోజు పునరుద్ధరిస్తామన్నారు. అన్ని తాగునీటి పథకాలను పునరుద్ధరిస్తున్నామని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని చెప్పారు. రాజంపేటలో 36 బోర్లు వేసి.. వాటిద్వారా నీటిని పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పునరుద్ధరించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫైర్ టెండర్లతో ప్రతి ఇంటినీ క్లీన్ చేస్తున్నామని తెలిపారు. దురదృష్టవశాత్తూ వరదల కారణంగా మరణించిన వారికి నష్టపరిహారాన్ని కూడా శరవేగంగా అందించామని కలెక్టర్లు తెలిపారు. మృతదేహాలు లభ్యమైన కుటుంబాలకు వెంటనే అందించామని చెప్పారు. గల్లంతై ఆచూకీ లభ్యంకాని వారి విషయంలో ఎఫ్ఐఆర్, పంచనామాలు పూర్తిచేస్తున్నామని తెలిపారు.దాదాపు 95 వేల కుటుంబాలు వరదలకు ప్రభావితం అయ్యాయని, ప్రభుత్వం ఇస్తున్న సహాయం పూర్తిగా వారికి అందాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. సహాయం అందించడంలో ఎక్కడా తప్పులు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. తాగునీటి విషయంలో అధికారులు శరవేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినందున.. తాగునీటి కొరత రాకుండా చూడాలని, దీనిపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### వ్యవసాయ చట్టాల రద్దు బిల్లుకు

# కేంద్ర కేబినేట్ ఆమోదం

న్యూఢిల్లీ: వ్యవసాయ చట్టాల రద్దు బిల్లుకు కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలిపింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ఈ రద్దను బిల్లుని కేంద్రం ప్రవేశపెట్టనుంది. “ద ఫామ్ లాస్ రిపీల్ బిల్ 2021 టు రిపీల్ త్రీ ఫామ్ లాస్” అని లోక్‌సభ చేపట్టబోయే బిజినెస్ లిస్ట్‌లో పేర్కొంది. ఈ సమావేశాల్లో మొత్తం 26 బిల్లులు ప్రవేశపెడుతుండగా జాబితాలో 25వ అంశంగా వ్యవసాయ చట్టాల ఉపసంహరణ బిల్లను ప్రవేశపెట్టడం, పరిశీలన, ఆమోదాన్ని ప్రతిపాదించింది. అయితే, తొలిరోజైన నవంబరు 29నే ఈ బిల్లను కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. గత వారం, ప్రధాన మంత్రి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ, నిరసన తెలుపుతున్న రైతులను వారి ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరారు. ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో, మూడు చట్టాలను రద్దు చేసే ప్రక్రియను పూర్తి



చేస్తామని ప్రధాని తెలిపారు. దాదాపు ఏడాది కాలంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. నవంబర్ 29 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్టాలను అధికారికంగా రద్దు చేసే వరకు నిరసనకారులు వేచి ఉంటారని రైతు నాయకుడు రాకేష్ టికైత్ అన్నారు.అలానే ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని కేంద్రం మరో నాలుగు నెలలు పొడిగించింది. ఈ పథకం ద్వారా కరోనా నేపథ్యంలో పేదలకు ఉచితంగా బియ్యం, పప్పు పంపిణీ చేశారు. దీన్ని మరో నాలుగు నెలలు పొడిగించారు. గడిచిన 15 నెలల కాలానికి గాను ఈ పథకానికి కేంద్రం 2,60,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ప్రకటించింది.

# స్మార్ట్ పోలీసింగ్‌లో సర్వేలో ఏపీ అరుదైన రికార్డు..



అమరావతి: జాతీయ స్థాయిలో ఘనతను చాటిన ఏపీ పోలీస్ శాఖను సీఎం వైఎస్ జగన్ అభినందించారు. ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించినందుకు ఏపీ పోలీసుశాఖను సీఎం మనస్ఫూర్తిగా అభినందించారు. ఇదేరీతిలో ప్రజలకు మరిన్నిసేవలను నిర్ణీతత సమయంలో అందించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. కాగా, ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్, పోలీసు ఉన్నతాధికారులు సచివాలయంలో సీఎంని కలిశారు

ఆ తర్వాత.. స్మార్ట్ పోలీసింగ్ సర్వే వివరాలను సీఎం జగన్‌కి వెల్లడించారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ స్మార్ట్ పోలీసింగ్ సర్వేలో.. ఏపీ పోలీసింగ్ నెంబర్‌వన్ ర్యాంక్ సాధించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించిన ఈ ఫౌండేషన్.. తొమ్మిది ప్రామాణిక అంశాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో సర్వే చేపట్టిందని డీజీపీ తెలిపారు. 2014లో డీజీపీల సదస్సులో ప్రధాని మోదీ పిలుపు మేరకు స్మార్ట్ పోలీసింగ్ పద్ధతులను పాటించామని తెలిపారు.ఆయా రాష్ట్రాలలో పోలీస్ ఫౌండేషన్ ఏడేళ్లుగా సర్వే నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది ఏపీ తొలిసారిగా మొదటి ర్యాంకు సాధించిందని డీజీపీ వివరించారు. ఏపీ పోలీస్ శాఖ.. ప్రజల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఐపిఎఫ్ఐపిఎఫ్ అధ్యయనం చేస్తుందని అన్నారు. దీనిలో రిటైర్డు డీజీలు,ఐపీఎస్‌లు,ఐఏఎస్‌లు, ఐఐటీ ప్రొఫెసర్లు, పౌరసమాజ ప్రముఖులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు.పౌరులపట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించడం, జవాబుదారితనం, ప్రజల నమ్మకం విభాగాల్లో ఏపీ నెంబర్ వన్ స్థానం సాధించిందని అన్నారు. సెన్సిటివిటీ, పోలీసుల ప్రవర్తన, అందుబాటులు పోలీస్ వ్యవస్థ, టెక్నాలజీ ఉపయోగం విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకింగ్ కనబర్చిందని డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, అడిషనల్ డీజీ (బెటాలియన్స్) శంకబ్రత బాగ్చి, డీఐజీ (టెక్నికల్ సర్వీసెస్) పాలరాజు, గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ్ వర్మ, గుంటూరు రూరల్ ఎస్పీ విశాల్ గున్నీ హాజరయ్యారు.


# 'అందుబాటులో ఉండే ధరకి సినిమా టికెట్లను తీసుకొస్తాం'

### రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పేర్ని నాని

అమరావతి: సినిమా అనగానే తమకి ఎదురుండకూడదన్న ధోరణిలో కొందరు ఉన్నారని, పేద, మధ్యతరగతి వాళ్ల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నారని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. ఐదో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సినిమా చట్ట సవరణ బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. సినిమా షోలను ఇష్టానుసారంగా వేస్తున్నారని, చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్నారని అన్నారు.కొందరు ఇష్టానుసారం ధరలను పెంచుకుంటున్నారని, అందుకే ఆన్‌లైన్ విధానంలో టికెట్ ఇచ్చే పద్ధతి తేవాలనుకున్నామని వివరించారు. దాంతో పాటు సినిమా షోలను కూడా అదుపు చెయ్యాలని నిర్ణయించామని పేర్కొన్నారు. సినిమా పరిశ్రమ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నడవాలని తెలిపారు.సినిమా కలెక్షన్లు, కడుతున్న టాక్సులకు సంబంధం లేదని చెప్పారు.ప్రభుత్వ పోర్టల్ ద్వారా పారదర్శకంగా, ప్రజలకు మంచి అందుబాటులో ఉండే ధరకి టికెట్లను తీసుకొస్తామని తెలిపారు. దీనిపై కొన్ని పార్టీలు, పేపర్లు, టీవీలు బురద వెయ్యడం దుర్మార్గమని అన్నారు. డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, ఎగ్జిబిటర్లు అందరు తమ విధానాలను స్వాగతించారని పేర్కొన్నారు. సినిమాటోగ్రఫీ చట్టంలో మార్పులు చేశామని తెలిపారు. థియేటర్లతో పాటు ఆన్‌లైన్‌లో కూడా టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సినిమా వినోదం అందరికీ అందుబాటులో ఉండాలని, ప్రజల ఉత్సాహాన్ని సొమ్ము చేసుకునేలా ఉండకూడదని తెలిపారు. ప్రొడ్యూసర్లుర, డిస్ట్రిబ్యూటర్లతో చర్చించి సాఫ్ట్‌వేర్‌ను తీసుకొస్తామని అన్నారు. పర్యావరణ హితం కోసమే కేంద్రం ఆదేశాల మేరకు గ్రీన్ టాక్స్ పెంచుతున్నామని, పాత వాహనాలను నిరుత్సాహ పరిచి పర్యావరణానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్ని నాని తెలిపారు. ఆటో, టూ వీలర్స్‌కి ఈ పెంపుదల ఉండదని, రూ. 20 లక్షలు పైబడిన వాహనాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. బెనిఫిట్ షోకి అవకాశం ఉందని, కానీ స్వచ్ఛంద సంస్థల కోసం బెనిఫిట్ షోలు ఉంటాయని, ఆయా సంస్థలు జాయింట్ కలెక్టర్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదనపు షోలు దొంగాటలేనని చట్టప్రకారం 4 షోలు మాత్రమే వేయాలని అన్నారు. తమ ప్రభుత్వానికి పెద్ద హీరో చిన్న హీరో అనేది లేదని, తాము ప్రేక్షకుల కోణంలో మాత్రమే చూస్తామని వివరించారు. వ్యతిరేకిస్తున్న ఒక పెద్ద హీరో ఏమి ఇబ్బంది ఉందో చెప్తే.. అది సహేతుకమైతే పరిశీలిస్తామని తెలిపారు.



# 13 వరకు ఇంటర్ పరీక్ష ఫీజు గడువు




అమరావతి: ఇంటర్మీడియెట్ మార్చి?2022 పబ్లిక్ పరీక్షలకు ఫస్టియర్, సెకండియర్ రెగ్యులర్ విద్యార్థులు, గతంలో ఫెయిలై మళ్లీ పరీక్షలకు హాజరవ్వాలనుకొనే విద్యార్థులు డిసెంబర్ 13వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరి బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఫీజుల వివరాలతో మంగళవారం బోర్డు ప్రకటన జారీ చేసింది.ఆలస్య రుసుములతో 2022 జనవరి 20 వరకు గడువు ఉందని పేర్కొంది. ఆలస్య రుసుము రూ.120తో డిసెంబర్ 23, రూ.500తో డిసెంబర్ 30, రూ.1,000తో 2022 జనవరి 4, రూ.2 వేలతో జనవరి 10, రూ.3 వేలతో జనవరి 17, రూ.5 వేలతో జనవరి 20 వరకు పరీక్ష ఫీజులను చెల్లించవచ్చునని వివరించింది. దరఖాస్తు రుసుము, పరీక్షలకు సంబంధించి ఫీజులను (పేపర్ల వారీగా, సంవత్సరాల వారీగా), ఇతర అంశాలను సర్క్యులర్‌లో పొందుపరిచింది.

పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, తాడేపల్లిగూడెం: పీహెచ్‌డీ పార్ట్‌టైం, ఫుల్‌టైం కోర్సులు, ఎంఎస్ (బై రీసెర్చ్) కోర్సుల్లో చేరడానికి ఏపీ నిట్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. డిసెంబర్ 2021 సెషన్‌కు సంబంధించి అర్హులైన వారిని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరింది. దరఖాస్తులకు డిసెంబర్ 4 వరకు గడువు ఉన్నట్లు నిట్ అధికారులు మంగళవారం తెలిపారు. పార్ట్‌టైం కోర్సులో 148 సీట్లు, ఫుల్‌టైం కోర్సులో 144 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారిని రాతపరీక్ష, ఇంటర్వ్యూ పద్ధతుల్లో ఎంపిక చేయనున్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి పరిస్థితులు: సోమిరెడ్డి

నెల్లూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. జిల్లాలో అపార



నష్టం జరిగిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే జిల్లాలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆరోపించారు. నెల్లూరు ఇసుక మాఫియా కరకట్టలు ధ్వంసం చేయడం వల్ల వరద ఊర్లపై వరద ఒక్కసారిగా రావడంతో అనేక గ్రామాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయన్నారు. ప్రతి కుటుంబానికి కడపలో 5,800 ఇచ్చినట్టుగా నెల్లూరులో కూడా వరద బాధితులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం సొంత జిల్లాలోనే 38 మంది వరద నీటికి కొట్టుకొని పోతే ఇంతవరకు జగన్, మంత్రులు వెళ్ళకపోవడం బాధాకరమన్నారు.

# జగన్ ఒక వృద్ధుడు.. ప్రజల్లో తిరగలేడు: చంద్రబాబు



తిరుపతి: సీఎం జగన్ ఒక వృద్ధుడు.. ప్రజల్లో తిరగలేడని, అందుకే వీడియో కాన్ఫరెన్స్‌లు పెడుతున్నాడని టీడీపీ నేత చంద్రబాబు ఎద్దేవాచేశారు. తిరుచానూరులో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మలగుంట భూముల కబ్జా.. ఆక్రమణలతో తిరుపతిని ఇప్పుడు ముంచారని దుయ్యబట్టారు. వైసీపీ పతనం ప్రారంభమైందని హెచ్చరించారు. తాగునీటి సంఘాలు పనిచేసి ఉంటే చెరువులు తెగేవా?అని ప్రశ్నించారు. తాము చెరువుల్ని ఆధునీకరించామని, విూలా ఆక్రమించలేదని చంద్రబాబు అన్నారు. వర్షాలు ఆగినా తిరుపతిలో ఇంకా కొన్ని కాలనీలు వరద నీటిలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. లక్ష్మీపురం, అబ్బన్న కాలనీ, ఆటోనగర్, జీవకోన, కేశవాయనగుంట, మహిళా వర్సిటీ ఎదురుగా వున్న సరస్వతీ నగర్, ఉల్లిపట్టెడ, శ్రీకృష్ణనగర్, గాయత్రీ నగర్ ఇంకా నీటిలోనే వున్నాయి.వ్యాపార కేంద్రమైన ఎయిర్ బైపాస్ రోడ్డులో ఇంకా వరదనీరు వెల్లువలా పారుతూనే ఉంది.వర్షం వచ్చినప్పుడల్లా వారాల తరబడి వ్యాపారాలు ఆగిపోతే వేలకువేలు బాడుగలు ఎలాకట్టాలని వ్యాపారులు మధనపడుతున్నారు.

# ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడానికేనా జగన్‌ను ఎన్నుకుంది?: పవన్

అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నేతలకు అరుపులు, కేకలు తప్ప సరిగా మాట్లాడడం రాదని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడానికేనా ప్రజలు జగన్‌ను ఎన్నుకుందని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి పక్కపక్కనే ఉండాలని, నవరత్నాలు అనే ఉంగరం ఇస్తే.. ప్రజల ఆకలి తీరుతుందా? అని నిలదీశారు. చదువుకోవాల్సిన పదేళ్ల విద్యార్థి పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను సరదా కోసం రాజకీయాల్లోకి రాలేదని, సమాజం కోసం వచ్చానని స్పష్టం చేశారు. వైసీపీ నేతలకు జనసైనికులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. 2024లో వైసీపీని ఓడించాలంటే జనసైనికుల్లో ఐక్యత ముఖ్యమని పవన్ కల్యాణ్ సూచించారు.

# సంపాదకీయం

**గురువారం 25 నవంబరు 2021**

## మరింత తగ్గనున్న పెట్రోలు ధరలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి సామాన్యులకు ఊరటనిచ్చేందుకు సిద్ధమవుతోంది. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలన తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నందున, చాలా దేశాలు తమ స్థాయిలో ఈ సమస్యను ఎదుర్కోవటానికి ప్రయత్నిస్తున్నాయని మీకు తెలియజేద్దాం. ముడి చమురు ధరలను తగ్గించడానికి ప్రధాన ఆర్థిక వ్యవస్థల తరహాలో భారతదేశం తన వ్యూహాత్మక చమురు నిల్వల నుండి ముడి చమురును వెలికితీసే అవకాశాలను కూడా పరిశీలిస్తోంది. ముడి చమురు ధరలను తగ్గించడానికి భారతదేశం ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో సమన్వయంతో తన వ్యూహాత్మక చమురు నిల్వల నుండి 5 మిలియన్ బ్యారెళ్ల చమురును వెలికితీయాలని యోచిస్తోంది. వ్యూహాత్మక నిల్వల నుంచి సేకరించిన ఈ క్రూడ్‌ను మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లకు విక్రయించనున్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. ఈ రెండు ప్రభుత్వ ఆయిల్ రిఫైనింగ్ యూనిట్లు పైప్‌లైన్ల ద్వారా వ్యూహాత్మక చమురు నిల్వలకు అనుసంధానించబడి ఉన్నాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలను ఎదుర్కోవటానికి, భారతదేశం తన వ్యూహాత్మక చమురు నిల్వ నుండి 5 మిలియన్ బ్యారెళ్లను విడుదల చేయనుంది. ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించారు. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. భారతదేశం, జపాన్‌తో సహా ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థల సహకారంతో ముడి చమురు అత్యవసర స్టాక్‌ను విడుదల చేయడానికి అమెరికా ప్రణాళిక వేసింది. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు కాస్త తగ్గే అవకాశం ఉంది.కేడియా కమోడిటీ డైరెక్టర్ అజయ్ కేడియా మాట్లాడుతూ పెట్రోలియం కంపెనీలకు తగ్గుతున్న క్రూడ్ ప్రయోజనం వల్ల సామాన్య ప్రజలకు ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు 2 నుండి 3 రూపాయల మేర తగ్గే అవకాశం ఉందని అన్నారు. అయితే రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీనపడితే ధరలు తగ్గడం కష్టమే.మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచడానికి వ్యూహాత్మక చమురు నిల్వను విడుదల చేస్తున్నట్లు ఇంధన నిపుణుడు నరేంద్ర తనేజా తెలిపారు. అమెరికా, భారత్, దక్షిణ కొరియా, జపాన్‌లు ముడి చమురు ధరలను బ్యారెల్‌కు 70 డాలర్లకు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయి. క్రూడ్ ధర 70 డాలర్లకు చేరితే, పెట్రోల్–డీజిల్, ఎల్‌పిజి ధరల తగ్గింపు రూపంలో భారతీయ వినియోగదారునికి కూడా ప్రయోజనం ఉంటుంది.భారతదేశం తూర్పు- పశ్చిమ తీరంలో మూడు ప్రదేశాలలో సుమారు 38 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కలిగి ఉంది. ఇందులో 5 మిలియన్ బ్యారెళ్లను 7-10 రోజుల్లో విడుదల చేయనున్నారు. ఈ స్టాక్‌ను మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ , హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ లకు విక్రయించనున్నారు. ఈ రెండు రిఫైనరీలు పైప్‌లైన్ ద్వారా వ్యూహాత్మక రిజర్వ్‌కు అనుసంధానించబడ్డాయి. “మరింత స్టాక్ కూడా తరువాత విడుదల కావచ్చు” అని ఆ అధికారి తెలిపారు. మరోవైపు, చైనా కూడా వ్యూహాత్మక నిల్వల నుంచి చమురును విడుదల చేసేందుకు సన్నాహాలు చేసింది.యుఎస్ ప్రెసిడెంట్ జో బిడెన్ అంటువ్యాధి తగ్గిన తర్వాత ముడి చమురు కోసం పెరిగిన డిమాండ్ కారణంగా సరఫరాను పెంచాలని పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ప్లస్ ను కోరారు. బిడెన్ సూచనను పట్టించుకోలేదు. దీని తరువాత, బిడెన్ ఇతర దేశాలతో వ్యూహాత్మక చమురు రిజర్వ్ నుండి చమురును విడుదల చేయడానికి ఒక ప్రణాళికను రూపొందించింది. ఈ విధంగా, చరిత్రలో తొలిసారిగా దేశాలన్నీ కలిసి చమురును విడుదల చేయనున్నాయి.చమురు ఎగుమతి చేసే దేశాలను దేశాలు అంటారు. ఒపెక్+లో రష్యా, ఒమన్, మెక్సికో, మలేషియా సహా 10 దేశాలు ఉన్నాయి. ఒపెక్‌లో ఇరాన్, ఇరాక్, యుఎఇ, సౌదీతో సహా 13 దేశాలు ఉన్నాయి.ముడి చమురు ప్రస్తుతం బ్యారెల్‌కు 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా, భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు వ్యూహాత్మక నిల్వల నుంచి చమురును విడుదల చేస్తే.. ముడి చమురు ధరలు తాత్కాలికంగా తగ్గే అవకాశం ఉందని ఇంధన నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని ప్రత్యక్ష ప్రభావం భారతదేశంలోని పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా కనిపిస్తుంది. పెట్రోలు, డీజిల్ ధరలు కాస్త తగ్గే అవకాశం ఉంది

# ఏజెన్సీలలో డోలి కష్టాలు

విశాఖపట్టణం, నవంబర్ 24, (న్యూస్ పల్స్)అటవీ ప్రాంతాల్లో ఎన్ని ఘటనలు జరుగుతున్నా.. సకాలంలో వైద్యం అందక తల్లిబిడ్డల ప్రాణాలు కోల్పోతున్నా.. అధికారులు మాత్రం చలించడం లేదు.. పాపం ఆ అమాయక గిరిజనుల తలరాతలు ఎన్నటికీ మారడం లేదు. మా గ్రామానికి రోడ్డు మార్గం కల్పించండి మహాప్రభో అంటూ వేడుకున్నా.. అధికారులు చలించడం లేదు. ఏజెన్సీలో నిండు గర్భిణీ కి మళ్ళీ డోలి మోత తప్పలేదు. రహదారి సౌకర్యం లేక గ్రామానికి అంబులెన్స్ రాకపోవడంతో కిలోమీటర్లు మోసుకెళ్ళి అంబులెన్స్ ఎక్కించారు గ్రామస్తులు. విశాఖపట్నం జిల్లా పరిధిలోని రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీలోని సింగి ఆదివాసీ గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం ఉండదు. రోగం వచ్చినా, అత్యవసర పరిస్థితులు వచ్చినా కాలినడకే వారికి దిక్కు. తీవ్ర అనారోగ్యం అయితే అప్పటికప్పుడు డోలి మోత మోయాల్సిందే. సింగి గ్రామానికి చెందిన గేమిల రాజేశ్వరి అనే మహిళ నిండు గర్భిణీ. ప్రసవ సమయం కావడంతో ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆరోగ్యం క్రమంగా ఆందోళనకరంగా మారడంతో ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. దీంతో ఆ గ్రామస్తులు అంబులెన్స్‌కు కాల్ చేశారు.కొంత దూరం వచ్చిన అంబులెన్స్ అక్కడినుంచి గ్రామం వరకు రాలేకపోయింది . కారణమేంటంటే ఆ గ్రామానికి రోడ్డు ఉండదు. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఆగిపోయింది. దీంతో ఇక చేసేది లేక.. గ్రామస్తులంతా డోలి కట్టారు. గర్భిణిని మోసుకుంటూ ముందుకుసాగారు. రాళ్ళు రప్పలు, వాగులు దాటుకుంటూ డోలి మోస్తూ పయనమయ్యారు. వైబి పట్నం వరకు వచ్చి ఆగిన అంబులెన్స్ వరకు.. డోలి మోస్తూ గర్భిణిని తరలించారు. అక్కడి నుంచి ఆ గర్భిణిని ఆసుపత్రికి తరలించారు. రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆంబులెన్స్‌లో తరలించి వైద్య సేవలు అందించారు.అయితే సింగి, పెద్ద గోరువు, పిత్రు గడ్డ, నుండి చలి

సింగం సికె పాడు వరకు ఏడు కిలోమీటర్ల పాటు గతంలో రహదారిన మంజూరైనా ఫారెస్ట్ అధికారుల క్లియరెన్స్ లేక ఆగిపోయింది. దీంతో ఆ రోడ్డు సమస్య యధాతథంగా కొనసాగుతూనే ఉందని గ్రామపెద్ద సత్తిబాబు తెలిపారు. రావికమతం మండలం చలి సింగం రోలుగుంట మండలంలో సింగి గ్రామాల ఆదివాసులు అనారోగ్యం పాలైతే డోలే మోయాలే తప్ప మరే ఆధారం లేదని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గతంలో మంజూరైన నిలిచిపోయిన రోడ్డు పనులను ప్రారంభించి ఆదుకోవాలని సీపీఎం నేత గోవింద్ కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి.. అడవిబిడ్డల ఆక్రందన వినాలని కోరుతున్నారు. గతంలో మంజూరైన రోడ్డుకు అన్ని అనుమతులు క్లియర్ చేసి రహదారి సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

# విజయనగరం రాజులు..మరోసారి

విజయనగరం, నవంబర్ 24, (న్యూస్ పల్స్)రాజకీయాల్లోఏదైనా జరగొచ్చు. ఎప్పుడు ఎలాంటి టర్న్‌లైనా తీసుకునే స్వేచ్ఛ రాజకీయాల్లో ఎప్పుడూ ఉంటుంది. ఇదే ఇప్పుడు వైసీపీలోనూ జరుగుతోందని అంటున్నారు గతంలో వైసీపీలో కీలక నేతగా ఎదిగిన విజయనగరం జిల్లా బొబ్బిలి రాజు సుజయ కృష్ణ రంగారావు త్వరలోనే మళ్లీ పాత గూటికి చేరేలా అడుగులు వేస్తున్నారని అంటున్నారు. కాంగ్రెస్‌లో రాజకీయాలు ప్రారంభించిన సుజయ ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించారు. తర్వాత వైఎస్‌పై ఉన్న అభిమానంతో ఆయన జగన్‌కు మద్దతు దారుగా మారారు. ఈ క్రమంలోనే వైసీపీ తరపున 2014లో విజయం సాధించారు.టీడీపీకి కంచుకోట వంటి విజయనగరంలో సుజయ వైసీపీ రాజకీయాలను జోరెత్తించారు. అయితే, పార్టీ అధికారంలోకి వస్తుందని అనుకున్నా.. అనూహ్యంగా ఓడిపోవడంతో ఆయన టీడీపీ బాట పట్టారు. బొబ్బిలి రాజులు వైసీపీని వీడడం వెనక చాలా కారణాలే ఉన్నాయి. తమకు చిరకాల రాజకీయ శత్రువుగా ఉన్న బొత్స సత్యనారాయణను జగన్ తమకు ఇష్టం లేకపోయినా పార్టీలో చేర్చుకోవడం కూడా వారు పార్టీ వీడడానికి మరో కారణం. ఇక టీడీపీ అధినేత.. అప్పటి సీఎం చంద్రబాబు.. మంత్రి పదవి ఇస్తానని ఆశ చూపడంతో సుజయ పార్టీ మారిపోయారు.అనుకున్న విధంగానే చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు. అయితే.. ప్రజలు సుజయపై ఉన్న నమ్మకాన్ని ఆయన నిలబెట్టుకోలేక పోయారు. పార్టీ మారి. రాజకీయాలు చేయడాన్ని హర్షించలేక పోయారు. దీంతోగత ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసినా.. సుజయ విజయం సాధించలేక పోయారు. ఇక, ఆ తర్వాత పార్టీలో అడపా దడపా కార్యక్రమాలు నిర్వహించినా.. అనుకున్న రేంజ్ గుర్తింపు రాలేదు సరికదా.. విజయ నగరంలో అశోక్ గజపతిరాజు దూకుడు ముందు సుజయ నిలబడలేక పోయారు. ఇదిలావుంటే.. టీడీపీలోనూ ఆయనకు ప్రాధాన్యం తగ్గిపోయింది.పార్టీ పదవులు సహా ఎందులోనూ ఆయనకు చంద్రబాబు చోటు ఇవ్వలేదు. పైగా చంద్రబాబు సుజయను నమ్మక ఆయన సోదరుడు బేబీ నాయనకు బొబ్బిలి పగ్గాలు అప్పగించారు. అప్పటి నుంచి సుజయ పార్టీ కార్యక్రమాల్లో, నియోజకవర్గంలోనూ కనపడడం లేదు. దీంతో ఇక, టీడీపీలో ఉండి లాభం లేదని అనుకుని ఉంటారని విజయనగరం రాజకీయాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సుజయ కృష్ణరంగారావు పార్టీ మారేందుకు రెడీ అయ్యారని టాక్ నడుస్తోంది. మరో ట్విస్ట్ ఏంటంటే జగన్ చూపు మాత్రం సుజయ కంటే బేబీ నాయన వైపే ఉందట. ఈ నేపథ్యంలో బొబ్బిలి రాజులు ఇద్దరూ కూడా పార్టీ మారిపోయినా ఆశ్చర్యపోక్కర్లేదన్న గుసగుసలు విజయనగరం జిల్లాలో వినిపిస్తున్నాయి


# నెల్లూరులో నత్తతో పోటీపడుతున్న ప్రాజెక్టులు

నెల్లూరు, నవంబర్ 24, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాలో దాదాపు 66 వేల ఎకరాలకు సాగునీరు అందించే కనుపూరు కెనాల్ లైనింగ్ పనులు నిలిచిపోవడంతో ఆ ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందడంలేదని ఆ ప్రాంత రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కెనాల్ లైనింగ్, స్టేక్చర్స్ రిపేర్లు జరిగి ఉంటే సాగునీరు సకాలంలో అందే అవకాశం ఉంది. ఆయా పనులు జరగకపోవడంతో కెనాల్‌లో సాగునీరు సక్రమంగా పారుదల లేక చివరి ఆయకట్టు వరకు అందక ఎండిపోతుందని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. సాగునీరందించే కనుపూరు కెనాల్ లైనింగ్ వర్క్స్ కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ప్యాకేజీ?4 కింద రూ.71.94 కోట్లు మంజూరు చేశారు. ఆయా పనులను ఏకేఆర్ కోస్టల్ కంపెనీ పేరుతో టెండర్ ద్వారా చేజిక్కించుకుని 2008 మార్చి మూడోతేదీన అగ్రిమెంట్ చేసుకున్నారు. రెండేళ్లలో ఆయా పనులు పూర్తి చేసేలా అగ్రిమెంట్‌లో చూపించారు. ఆ నిధులతో జిల్లాలోని సంగం నుంచి బండేపల్లి వరకు సుమారు 55 కిలో మీటర్లు కనుపూరు కెనాల్ లైనింగ్ వర్క్స్, 44 స్ట్రెక్చర్స్ రిపేర్లు చేయాల్సి ఉంది. ఆ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పర్సెంటేజీలు తీసుకుని సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించారు. 55 కిలోమీటర్ల వరకు కెనాల్ లైనింగ్ పనులను భాగాలుగా విభజించి సబ్ కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. కానీ పదకొండేళ్లు పూర్తయినా కూడా లైనింగ్ పనులు మాత్రం నత్తను తలపిస్తున్నాయి. ఇప్పటివరకు 51.94 శాతం పనులే పూర్తి చేశారు. మిగిలిన 48.6 శాతం పనులు పూర్తికాలేదు. టెండర్ అగ్రిమెంట్‌లో మాత్రం రెండేళ్లకాల వ్యవధిలో పూర్తిచేస్తానని చూపించినా దశాబ్దకాలం దాటినా కూడా పనులు పూర్తి చేయకపోవడం వెనుక కాంట్రాక్టర్ అత్యాశ, అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో మాత్రం సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామంటూ కల్లిబొల్లి మాటలతో నెట్టుకొచ్చారే తప్పా ప్యాకేజీ ?4 పనులపై గత పాలకులు దృష్టిసారించలేకపోయారు. కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు తీసుకుంటూ పనులు చేయని వారికి వత్తాసు పలుకడంతో ప్యాకే జీ?4 పనుల్లో అడుగుమందుకు పడలేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ ప్యాకేజీ?4 పనులు నత్తనడకన సాగిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించలేదు. గతేడాది నుంచి కెనాల్ లైనింగ్ పనులు పూర్తి స్థాయిలో నిలపివేశారు. పూర్తయిన పనులకు దాదాపు రూ.4 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సాకు చూపి సదరు కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో పనులు నిలిపివేసినట్లు అధికారులు చెపుతున్నారు. ప్రతిఏటా ఆ వర్క్స్ అగ్రిమెంట్ పెంచుకుపోతున్నా కూడా కాంట్రాక్టర్ సహకరించడం లేదని అధికారులు తెలిపారు. పనులు పూర్తిచేయాలని రెండు సార్లు నోటీసులు జారీ చేసినా కాంట్రాక్టర్ నుంచి స్పందన లేదని తెలుస్తోంది.

# ముద్రగడను కలిసిన కాకినాడ మేయర్‌కిర్లంపూడి

మాజీమంత్రి, కాపు ఉద్యమనేత అయిన ముద్రగడ పద్మనాభం మంచి సహృదయం గల నాయకుడు కావడం వల్లే కిర్లంపూడి కి వెళ్లి ముద్రగడ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని కాకినాడ నగర పాలక సంస్థ మేయర్ సుంకర శివ ప్రసన్న సాగర్ వివరించారు. రాష్ట్రంలో ముద్రగడ వంటి చరిష్మా ఉన్న నాయకులు చాలా అరుదుగా ఉంటారని అటువంటి నాయకుడిని కలవడం చాలా గర్వంగా ఉందని ఆమె అన్నారు. తనని కలిసేందుకు విచ్చేసిన మేయర్ లక్ష్మీ ప్రసన్న సాగర్ నీ ,అలాగే డిప్యూటీ మేయర్లు చోడిపల్లి సత్యప్రసాద్ మాస్టారు, మీసాల ఉదయ్ కుమార్ లను కుడా మాజీమంత్రి ముద్రగడ సాదరంగా ఆహ్వానించి అల్పాహారాన్ని అందించారు. అనంతరం వచ్చిన వారందరూ ముద్రగడ తో ఫోటోలు దిగి వారి యొక్క అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మేయర్ డిప్యూటీ మేయర్ లతో కాకినాడ నగర ప్రజలకు సుపరిపాలన అందించడం ద్వారా మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, 30 వ డివిజన్ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్నీ), కాకినాడ అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు, ముద్రగడ గిరిబాబు, చల్లా సత్యనారాయణ, దాడి సూరిబాబు, బావిశెట్టి వెంకటరమణ, షేక్ ఇబ్రహీం , ఆడారి నానాజీ, అడపా రఘు, మండపాక చలపతి తదితరులు పాల్గొన్నారు.

# ఏడు రూపాయిలకు చేరిన కోడి గ్రుడ్డు ధర



హైద్రాబాద్, నవంబర్ 24, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో కోడి గుడ్ల ఉత్పత్తి పెరిగినా వాటి ధరలు మాత్రం పెరిగిపోతున్నాయి. గ్రేటర్ పరిధిలో గుడ్ల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను విపరీతంగా పెంచేస్తున్నారు. ఉత్పత్తి దారుల ధరలు ఒకలా ఉంటే అది వినియోగదారుని వద్దకు వచ్చే సరిగాకి రెట్టింపు అవుతోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కోడిగుడ్ల ఉత్పత్తులు బానే ఉన్నాయని నెక్ వర్గాలు చెబుతున్నాయి. శివారు ప్రాంతాల్లో సుమారు 80 వరకు ఉన్న ఫౌల్ట్రీ ఫారాలు, చికెన్‌తో పాటు కోడి గుడ్లపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారు.అయితే వేసవిలో చికెన్ వినియోగం కొంత తగ్గినా గుడ్ల వినియోగం మాత్రం రికార్డు స్థాయిలో ఉన్నట్లు పౌల్ట్రీ వ్యాపారులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజుకు కోటి వరకు గుడ్ల వినియోగం జరుగుతోంది. వేసవి సెలువులు కావడంతో అంగన్ వాడీలు,హస్టళ్ళు మూసి ఉంచడంతో గుడ్ల సరఫరా నిలిచిపోయింది. ఈ పథకాల కోసం రోజుకు 50 లక్షల మేరకు గుడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండేది. అయితే హస్టళ్ళు, అంగన్ వాడీ కేంద్రాలు మూసి ఉంచడంతో వాటి వినియోగం జరలేదు. గుడ్లను సరఫరా చేసే ఫౌల్ట్రీ వ్యాపారులు బహిరం మార్కెట్‌లకు వాటిని తరలిస్తున్నారు. అయినా కూడా నగరంలో గుడ్ల ధరలు మాత్రం తగ్గడం లేదు.వాస్తవంగా ఫామ్ ధర గుడ్డుకు రూ.3.50 నుంచి 3.75 పైసలకు మధ్యవర్తులు కొనుగోలు చేస్తున్నారు. తిరిగి వారు హోల్ సేల్ వ్యాపారులకు తిరిగి రూ.3.80 పైసల నుంచి3.90కు పైసలకు అమ్ముతున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు రిటైల్ వ్యాపారులకు ఒక గుడ్డ రూ.4.25 పైసల నుంచి రూ.4.50 పైసల వరకు అమ్ముతున్నారు.

# రాజధాని రగడ... ఆగేదెన్నడు..?

విజయవాడ, నవంబర్ 24, (న్యూస్ పల్స్)ఎవరు ఏమైనా అనుకోవచ్చు. రాజధాని విషయంలో మాత్రం జగన్ నిర్ణయం సరైనదే. భవిష్యత్ లో ఆంధ్రప్రదేశ్ మరిన్ని ముక్కలు కాకుండా ఉండాలంటే జగన్ నిర్ణయమే కరెక్ట్. ఇప్పటికిప్పుడు కాదు. వందేళ్ల తర్వాత అయినా అమరావతి రాజధానిగా ఒక్కటి ఉంటే మరోసారి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం రాక మానదు. అందుకే జగన్ నిర్ణయాన్ని అన్ని ప్రాంతాల ప్రజలు, మేధావులు, పార్టీలు కూడా భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సమర్థించాల్సిందే.. 23 జిల్లాల డబ్బు పోగేసి హైదరాబాద్ నిర్మాణం చేసినా, ఏమి చేయలేదు అనిపించుకుని, తన్ని తరిమి వేయబడి, ఇక్కడి తీర ప్రాంతం తేమ, జిడ్డు, జిగటలను అసహ్యించుకుని, గతిలేక మళ్ళీ వెనక్కివచ్చి అదే పొరపాట్లు ఎందుకు చేయాలి. మళ్ళీ 13జిల్లాల ప్రజల రెక్కల కష్టాన్ని, పన్నుల ఆదాయాన్ని అమరావతిలో కుప్పగా పోగేయాలా? ఈ ప్రశ్నలకు సమాధానం చంద్రబాబు చెబుతారా? అదే జరిగితే మరోసారి ముక్కలు చేయడానికి సిద్ధమవుతారా? ఎందుకు మద్దతివ్వాలి? రాజధానిగా అమరావతి ఒక్కటే ఉండటానికి అందరూ మద్దతివ్వాలా? రేపు జగన్, బాబు పదవి నుంచి దిగి పోయాక ఏపీలో మరో కేసీఆర్ వచ్చి కొత్త రాజకీయ వాదం పుడితే, ఉత్తరాంధ్ర, రాయలసీమ వాళ్ళు కోస్తా వాళ్ళని అసహ్యించుకుంటారు. అలా ఏమి జరగదు అనే గ్యారంటీ ఏమైనా ఇస్తారా? లేదు ఇవ్వలేరు. ఎందుకంటే భవిష్యత్ ను గురించి రాజకీయ నేతలు చెప్పే మాటలను ఎవరూ నమ్మరు. నమ్మబోరు. వారిచ్చే హామీలనే అమలు చేయరు.

# అధికార వికేంద్రీకరణ పేరుతా అడుగులు

విజయవాడ, నవంబర్ 24, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల చట్టాన్ని వెనక్కు తీసుకున్నారు. జగన్ భయపెడితే భయపడే వాడు కాదు. బెదిరిస్తే బెదిరేటోడు కాదు. చెప్పినా వినేటోడు కాదు. మరి ఎందుకు ఈ చట్టాలను వెనక్కు తీసుకున్నారు. జగన్ మడమ తిప్పినట్లేనా? కొత్త చట్టాలను తెస్తామని అసెంబ్లీ సాక్షిగా జగన్ చెప్పినప్పటికీ ఏ రూపంలో వస్తాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. బిల్లులు ఏ రూపంలో ఎప్పుడు వస్తాయో మంత్రులు, ఎమ్మెల్యేలకే తెలియదు. ముఖ్యమంత్రి జగన్ మాటల్లో అందరి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తీసుకుని బిల్లులలో మార్పులు చేర్పులు చేసి తీసుకుని వస్తామని చెప్పారు. చాలా సులువుగా ప్రజాభిప్రాయాన్ని సేకరించే వీలుంటుందంటున్నారు. ఆగస్టు వరకూ అయితే ఈ బిల్లులు వచ్చే అవకాశం లేదు. సెప్టంబరు నెలలోనే ఈ కొత్త బిల్లులను తెచ్చేందుకు అన్నీ లెక్కలు వేసుకుని జగన్ మరీ సిద్ధమవుతున్నారు. అప్పటికి అంతా క్లియర్ అవుతుందంటున్నారు. మూడు రాజధానులు అని పేరు లేకుండా అధికార వికేంద్రీకరణ పేరుతో కొత్త బిల్లులు వచ్చే అవకాశముంది.ఇక ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో కూడా జగన్ మరో ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ పూర్తయ్యాయి. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు దాదాపుగా పూర్తయ్యాయి. రాజమండ్రి కార్పొరేషన్ లాంటివి మినహా అన్ని చోట్ల దాదాపు ఎన్నికలు ముగిసినట్లే. వీటిలో 90 శాతం వైసీపీ విజయం సాధించింది. తెలుగుదేశం పరిషత్ ఎన్నికలను బహిష్కరించింది. జనసేన అతి కొద్ది సీట్లలో గెలిచింది. పంచాయతీల నుంచి కార్పొరేషన్ ల వరకూ అధికార వికేంద్రీకరణ లేదా మూడు రాజధానులకు అనుకూలంగా తీర్మానం చేసి పంపే విధంగా వైసీపీ ప్లాన్ చేసే అవకాశముంది. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మూడు రాజధానులకు సానుకూలత ఉందని చెప్పుకునే వీలు ప్రభుత్వానికి కలుగుతుంది. న్యాయస్థానాల్లోనూ ఇది ఒక చిన్న ఆయుధంగానైనా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అందుకే పంచాయతీ నుంచి కార్పొరేషన్ వరకూ తీర్మానాలు చేసి పంపే విధంగా పార్టీ నాయకత్వం ప్లాన్ చేసినట్లు సమాచారం. మొత్తం మీద ఎప్పుడు బిల్లులు తెస్తాడో తెలియదు కాని, సరైన టైంలోనే తెస్తాడన్నది పార్టీ నుంచి విన్పిస్తున్న టాక్.

# చింతకాయల విజయ్ లెక్కలు తవ్వుతున్నారే

విశాఖపట్టణం, నవంబర్ 24, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అంటే ఫైర్ బ్రాండ్ అని ఎవరైనా చెబుతారు. ఆయన నోరు చాలా పెద్దది. ఆయన నోరు తెరిచారా ఎక్కడ లేని విమర్శలు అలా గటగటా వచ్చేస్తాయి. ఆయనది దాదాపుగా నాలుగు దశాబ్దాల రాజకీయం. ఇక అయ్యన్నపాత్రుడు వారసుడిగా కొన్నాళ్ళ క్రితం రంగప్రవేశం చేసిన పెద్ద కొడుకు చింతకాయల విజయ్ పాత్రుడు ఇపుడు వైసీపీకి టార్గెట్ కావడం జిల్లా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. విజయ్ పాత్రుడు అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకుని వారిని బినామీలుగా చేసి అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అని జిల్లా మైనింగ్ శాఖ అధికారులు తాజాగా గుట్టు తేల్చారు.విజయ్ పాత్రుడుని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈ మధ్యనే చంద్రబాబు నియమించారు. దాంతో ఆయన నర్శీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్ధి అని అపుడే ప్రచారం అయిపోయింది. దాంతో జూనియర్ అయ్యన్నపాత్రుడిదే జిల్లా రాజకీయం అని టీడీపీలో అంతా ఆనందిస్తున్న వేళ అక్రమ మైనింగ్ వ్యవహారాల్లో ఆయన చిక్కుకోవడం ఇబ్బందికరమే. తూర్పుగోదావరికి చెందిన ఇద్దరు గిరిజనులు పేరు మీద విశాఖ జిల్లాలో మైనింగ్ లీజులను తీసుకుని విజయ్ తానే వాటిని నిర్వహిస్తున్నారు అని మైనింగ్ అధికారులు ఆధారాలు సేకరించారట. ఇక విజయ్ కి బినామీలు అని చెబుతున్న ఆ ఇద్దరు గిరిజనులకు అక్రమ మైనింగ్ చేసినందుకు గానూ 17 కోట్ల రూపాయల భారీ జరీమానా కూడా విధించారు.కొడుకు రాజకీయంగా ఎదుగుతున్నాడు అని అయ్యన్నపాత్రుడు సంబరపడినంత సేపు లేదు మరి. విశాఖ జిల్లాలో అక్రమాల మూలాలను ఎక్కడ జరిగినా తవ్వితీసి మరీ వైసీపీ సర్కార్ ఒక్కొటిగా బయట పెడుతోంది. ఇందులో భాగంగానే 2016లో అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉండగా విజయ్ ఇలా బినామీల పేరిట అక్రమ మైనింగ్ వ్యవహారాలకు తెరలేపారని అంటున్నారు. మరి కట్టుకునేందుకు బట్ట,తినడానికి తిండి కూడా లేని ఆ గిరిజనులు 17 కోట్ల జరీమానా ఎలా కట్టగలరు. అసలు మైనింగ్ అన్న మాటకు కూడా వారికి అర్ధాలు తెలియవు. దాంతో తెర వెనక ఉన్న పెద్దల గుట్టు రట్టు చేసే పనిలో మైనింగ్ అధికారులు బిజీగా ఉన్నారట. అదే జరిగితే అయ్యన్నపాత్రుడు కు భారీ దెబ్బేనని అంటున్నారు.

# తాడేపల్లిలో లోకేష్ పర్యటన

తాడేపల్లి గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాన్ని పరామర్శించారు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్. ఇటీవల ఉరివేసుకుని చనిపోయిన వార్డ్ వాలంటీర్ కుటుంబాన్ని పరా మర్శించారు లోకేష్. ఇటీవల టీడీపీ కార్యకర్తకు చెందిన ఆటో తగలబడింది. ఆ కుటుంబాన్ని పరామర్శించి.... టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. శాసనసభలో తన తల్లిని అవమానిం చారని,తల్లిపై చేసిన వ్యాఖ్యల నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకే మూడు రాజధానుల ఉపసంహారణ బిల్లును ప్రవేశ పెట్టారని అన్నారు.

# నెల్లూరు, ప్రకాశం మధ్య పోర్టు రచ్చ

నెల్లూరు, నవంబర్ 24, (న్యూస్ పల్స్)దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్నట్లు ఉందని.. ప్రకాశం జిల్లా జనాలు నానా మాటలూ అంటున్నారు. లీడర్లేమో.. గప్ చుప్ గా ఉంటున్నారని తిట్టిన తిట్టు తిట్టకుండా కొత్త తిట్లు వెతికి మరీ తిడుతున్నారు. ప్రకాశం జిల్లాలో పోర్టు వచ్చింది అని సంబర పడ్డ జనాలు.. ఉత్త పోర్టు మాత్రమే ఉంటే ఏమొస్తుంది.. దాని అనుబంధ పరిశ్రమలు కూడా మా జిల్లాలోనే ఉండాలి అని డిమాండ్ చేస్తున్నారు. సొమ్మొకరిది సోకు ఒకరిది అన్నట్లు.. పోర్టేమో మా జిల్లాలో పెట్టి.. డెవలప్ మెంట్ ఏమో నెల్లూరు జిల్లాలో చేస్తారా అంటున్నారు.మరి కథేందయ్యా అంటే.. ప్రకాశం జిల్లాలో పోర్టు శాంక్షన్ అయింది. సో.. అంతా బావుంది. పోర్టు కోసం భూముల సేకరణ కూడా జరుగుతోంది. సో.. ఇది ఇంకా బావుంది. రెండు గ్రామ పంచాయితీల్లో భూములు సేకరిస్తున్నారు అని తెలిసింది. వాళ్లు హ్యాప్పీ. ఇది ఇంకా బావుంది కదా. కానీ.. పోర్టుకి దాని రిలేటెడ్ పరిశ్రమలు కట్టడానికి.. రెండు గ్రామ పంచాయితీల్లో వాళ్లు సేకరిస్తున్న భూమి సరిపోదు. అక్కడొచ్చింది జనాలకి డౌటు. వెంటనే ఇంకో పక్కన గుప్పుమన్న న్యూస్ ఏంటయ్యా అంటే.. నెల్లూరు జిల్లాలో భూములు సేకరిస్తున్నారట. ఈ విషయం ఈ రోజుల్లో ఎన్నాళ్లు తెలుస్తుంది చెప్పండి. వాట్సాప్ గ్రూపుల్లో వార్త రాగానే.. ప్రకాశం జిల్లా జనాలు అగ్గిమీద గుగ్గిలం అవతున్నారు. పోర్టు ఒక్కటే కాదు.. అనుబంధ పరిశ్రమలు కూడా మా జిల్లాలోనే పెట్టాలి. సొమ్ము మా పేరు మీద ఇచ్చి.. వాడుకోమని వాళ్లకి చెబుతారా అంటూ సీరియస్ అవుతున్నారు. ఇక్కడే భూములు సేకరించండి.. ఇక్కడే డెవలప్ చేయండి అని డిమాండ్ చేస్తున్నారు. వాళ్లేమో.. మేమూ ఇదే రాష్ట్రంలో ఉన్నాం కదా.. మాకూ కాస్త డెవలప్ మెంట్ వస్తే మీ సొమ్మేం పోతుంది. మీరే కట్టకట్టుకుని అన్నీ తింటారా అంటున్నారట. జనాల గొడవ ఇప్పుడు లీడర్ల పంచాయితీ దాకా పోయింది. ఇప్పుడు లోకల్ లీడర్ల సావుకొచ్చింది ఎవ్వారం అంటున్నారు అక్కడి పొలిటీషియన్లు.

# లెక్కలు తేలని 64 వేల కోట్లు

విజయవాడ, నవంబర్ 24, (న్యూస్ పల్స్)రాష్ట్ర ఆర్థికశాఖ గణాంకాల్లో మాయాజాలం కనిపిస్తోంది. ఆమోదించిన బడ్జెట్‌కు, అమలు చేస్తున్న బడ్జెట్‌కు మధ్య పొంతన కనిపించడం లేదు. బడ్జెట్‌లో లేని వాటికి భారీగా వ్యయం చేస్తుండగా, ఉన్న వాటికి ఖర్చు చేయని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పలు శాఖల నిధులు ఇతర శాఖలకు దారిమళ్లినట్టేనని కొంతమంది అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయం పరిశీలనలో ఇవే అరశాలు బయటపడినట్లు తెలిసింది. ఏకంగా వేల కోట్లలో ఇలా ఖర్చుల్లో అంతరాలు వెలుగుచూడడం గమనార్హం. కొన్ని ఖర్చులకు సంబంధించిన వివరాలు కూడా లేనట్లు స్పష్టమవుతోంది.తాజాగా వెలుగుచూసిన లెక్కల్లో ఏకంగా 64,475 కోట్ల రూపాయల వ్యయానికి అసలు బడ్జెట్‌లో కేటాయింపులే లేవని తేలింది. కేవలం 57 కేసుల్లోనే ఇరత నిధుల వివరాలు లేకపోవడం, ఆమోదం లేకుండానే ఖర్చు చేయడం సామాన్యమైన విషయం కాదని అధికారులు అంటున్నారు. ఇరదులో ఆర్థికశాఖ పరిధిలోని ద్రవ్య యాజమాన్యం, ప్రణాలిక కిందనే ఏకంగా రూ.63 వేల కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తేలింది. ఈ మొత్తంలో ఒక్క రూపాయికి కూడా బడ్జెట్‌లో కేటాయింపులు లేవని స్పష్టమైంది. ఈ నిధులు దేనికి ఖర్చు చేసారన్నది కూడా అస్పష్టంగా ఉందని సమాచారం. అలాగే 638 కోట్లు హోంశాఖలో, రూ.144 కోట్లు పట్టణాభివృద్ధి శాఖలో, వంద కోట్ల వరకు మత్స్య శాఖలో, 244 కోట్ల వరకు ఐటి శాఖలో ఖర్చు జరిగింది.బడ్జెట్‌లో ఆమోదించినప్పటికీ కొన్ని శాఖల్లో ఖర్చు జరగని వైనం కూడా కనిపించింది. దీని విలువ ఏకంగా రూ.37 వేల కోట్ల వరకు ఉందని సమాచారం. ఆర్థికశాఖకు కేటాయించిన పలు పద్దుల్లో రూ.16,300 కోట్ల వరకు ఖర్చు జరగలేదు. ఇదే ఆర్థికశాఖలోని ద్రవ్య నిర్వహణ విభాగంలో రూ.62 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయడం, ఇదే విభాగంలోని మరికొన్ని పద్దుల్లో రూ.16 వేల కోట్లు ఖర్చు కాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంటే నిధుల వినియోగంలో దారి మళ్లింపు స్పష్టంగా ఉందన్న భావన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో బడ్జెట్‌లో జరిగిన కేటాయింపుల కన్నా కొన్ని రంగాల్లో రూ.5838 కోట్లు అదనంగా ఖర్చు చేసిన వైనం కూడా వెలుగుచూసింది. ఇరదులో కూడా ఆర్థికశాఖ ద్రవ్య నిర్వహణకు జరిగిన కేటాయింపుల్లోనే రూ.2050 కోట్లు అదనంగా ఖర్చు కావడం విశేషం. వైద్య శాఖలో కూడా కేటాయింపుల కన్నా రూ.1724 కోట్లు అదనంగా ఖర్చు జరిగింది. వీటిపై అధ్యయనం చేసిన అకౌంటెట్ జనరల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరాలు కోరినట్లు తెలిసింది.

# టమాటా ఇవ్వండి.. ఫ్రీ బిర్యానీ

తిరువనంతపురం, నవంబర్ 24, (న్యూస్ పల్స్)భోజన ప్రియులకు శుభవార్త.. పసందైన ? రుచికరమైన వంటకాన్ని ఫ్రీ ఇస్తానంటూ ప్రకటించింది ఓ బిర్యానీ సెంటర్.. అయితే, ఓ కండిషన్ పెట్టింది. బిర్యానీ కోసం వచ్చే వారు కిలో టమాటోలు వెంట తీసుకువచ్చి ఇవ్వాలంటూ షరతు పెట్టింది. లేదంటే బిర్యానీ కొంటే టమాటోలు ఫ్రీ ఇస్తానని ప్రకటించింది. దీంతో భోజన ప్రియులు ఎగబడి మరీ కొంటుండటంతో బిర్యానీ సెంటర్‌కు భారీగా గిరాకీ పెరిగింది. పక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రంలో జరిగింది. ఇక, పూర్తి వివరాల్లోకి వెళ్తే.. చెన్నై శివార్లలో ఉన్న అంబూర్ బిర్యానీ సెంటర్ నిర్వాహకులు ఇచ్చిన స్పెషల్ ఆఫర్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రేండింగ్ మారింది.ఎందుకిలా అంటే.. చెన్నైలో కేజీ టమాటో ధర రూ.150కి పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో చెంగల్పట్టు జిల్లాలోని మధురాంతకం ప్రాపర్టీలోశ్రీతీ అంబూర్ బిర్యానీ షాప్ యజమాని తన సేల్స్ పెంచుకోవడం కోసం ఒక కొత్త ఆఫర్ కస్టమర్లకు ప్రకటిచారు. దీంతో బిర్యానీ కోసం భోజన ప్రియులు ఎగబడుతున్నారు. ఇంతకీ ఏం ఆఫర్ చేశాడంటే.. అంబూర్ బిర్యానీ షాప్‌లో ఒక కేజీ బిర్యానీ వంద రూపాయిలు, ఎవరైనా రెండు కేజీల బిర్యానీ కొంటే వారికి అరకిలో టమాటాలు ఫ్రీగా ఇస్తామని ఆఫర్ చేశారు. లేదంటే, ఒక కేజీ టమాటోలు తీసుకుని వచ్చి ఇస్తే.. ఒక కేజీ బిర్యానీ ఫ్రీగా ఇస్తామని ఆఫర్ ఇవ్వడంతో జనం తండోపతండాలు వస్తున్నారు. దీంతో గిరాకీ పెరిగింది. తను అనుకున్నది సక్సెస్ అవ్వడంతో షాపు యాజమాని తెగ మురిసిపోతున్నాడు. అయితే, టమాటా ధర పతనంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే మంగళవారం ఫ్రీ సేల్ నిర్వహించినట్లు దుకాణం యజమాని తెలిపారు.

# అక్రమ బంగారం పట్టివేత

శంషాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో మరోసారి బంగారం పట్టుబడింది. నిందితులు విదేశాల నుండి బంగారం తరలించేందుకు అనేక ఎత్తుగడలు రచించి అడ్డంగా దొరికిపోతున్నారు. గ్రాండర్ లలో, కుక్కర్ లలో, షూలలో, వేసుకున్న దుస్తుల్లో, ఇలా అనేక ఎత్తుగడలు వేస్తున్నారు. అయితే తాజాగా షార్జా నుండి వచ్చిన ప్రయాణికుడు చేతికి పెట్టుకునే వాచ్ లలో బంగారం దాచి కస్టమ్స్ అధికారుల కళ్ళు గప్పే ప్రయత్నం చెసి అడ్డంగా దొరికిపోయాడు.

# ప్రణాలికా లోపంతోనే...కొంప ముంచిన తిరుపతి



తిరుపతి, నవంబర్ 24, (న్యూస్ పల్స్)ఎప్పుడో తాతల కాలం నాటి ప్రణాళికలతోనే తిరుపతి ఉంది. పేరుకు స్మార్ట్‌సిటీ అయినా నగరాభివృద్ధికి తగినట్లుగా ప్రణాళికలు లేకపోవడం 'కొంప'ముంచింది. ఏడు కొండలు ఉన్నా వరద నీరు పోయేందుకు ఎప్పుడో సహజసిద్ధంగా ఏర్పడిన మాల్వాడిగుండమే గతి తప్పు, ఆధునిక, ప్రత్యేక కార్యాచరణ లేకుండా పోయింది. మాల్వాడిగుండం నాలుగు దశాబ్దాలుగా ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. చెరువులు, గెడ్డ స్థలాలు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. వాటిలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరిగాయి. విస్తరించిన నగరానికి అనుగుణంగా భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. నగరాభివృద్ధికి తగ్గట్లుగా వర్షపు నీరు మళ్లించే సరైన ప్రణాళిక లేకుండా లేకుండాపోయింది. ప్రస్తుతం తిరుపతిని వరద నీరు ముంచడానికి ప్రధాన కారణాలు ఇవేనని విశ్లేషకులు అంటున్నారు.మాల్వాడిగుండం కాలువ సహజ సిద్ధంగా ఏర్పడింది. తిరుమల కొండల్లో కురిసిన వర్షం నీరంతా కపిలతీర్థం నుంచి మాల్వానిగుండం కాలువకు వస్తుంది. ఈ కాలువ 40 ఏళ్లుగా కబ్జాలకు గురవుతూ వస్తోంది. బహుళ అంతస్తుల నిర్మాణాలు జరిగిపోయాయి. ఈ కాలువలో వర్షం నీరు మాత్రమే ప్రవహించేది. ప్రస్తుతం ఆక్రమణలకు గురికావడంతో మురుగునీటితో పాటు వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఈ కాలువను 2002, 2003లో డిఎఫ్ఐడి బ్రిటన్ నిధులతో రెండు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అభివృద్ధి చేశారు. మాల్వానిగుండం నుంచి వచ్చే వర్షపు నీరు శివజ్యోతి నగర్, ఎర్రమిట్ట మీదుగా రాజీవ్ నగర్ నుంచి వినాయక సాగర్‌కు వెళ్లేది. ఈ చెరువు నిండిన తరువాత అక్కడి నుంచి శెట్టిపల్లి చెరువు, వెంకటాపురం, కరకంబాడి చెరువులకు వర్షపు నీరు మళ్లేది. వినాయక సాగర్ సైతం ఆక్రమణకు గురైంది. దీంతో, వర్షపు నీరు చెరువులోకి వెళ్లేం దుకు మార్గం లేక రోడ్లపైకి వచ్చి మడుగును తలపిస్తోంది. యాభై ఏళ్ల క్రితం వరకూ తిరుపతి, తిరుపతి రూరల్ పరిధిలో 48 చెరువులు ఉండేవి. నగరం విస్తరణ క్రమంలో వీటిలో మూడొంతుల చెరువులు ఆక్రమణకు గురయ్యాయి.
గతంలో తిరుపతిలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఉండేది. ఈ కమిటీకి టిటిడి ఇఒ ఛైర్మన్‌గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరించేవారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (తుడా) వైస్‌ఛైర్మన్ మెంబర్లు ఉండేవారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై తిరుపతి అభివృద్ధి, సమస్యలపై చర్చించాలి. 2014 నుంచి ఈ కమిటీ సమావేశం జరగడం లేదు. విభాగాల మధ్య సమన్వయం లోపించింది. అభివృద్ధి కుంటుపడింది. సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి.ఇప్పుడు ఉన్న తిరుపతి నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం, తుడా కార్యాలయం, తుడా గ్రౌండ్, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ ఒకప్పుడు తాతయ్యగుంట చెరువు. బమ్మగుంట, చిన్నగుంట, మంచినీళ్లగుంట, రామచంద్ర పుష్కరణి, ఐఎస్ మహల్, జ్యోతి టాకీస్ ప్రాంతాలు కూడా ఒకప్పుడు చెరువుల ప్రాంతాలే. ఇప్పుడు అక్కడ అపార్టుమెంట్లు నిర్మితమై వ్యాపార సముదాయాలు వెలిశాయి. కొరమేనుగుంట, చెన్నాయగుంట, లక్ష్మీనగర్, పార్వతీపురం ప్రాంతాలు కూడా చెరువు లోతట్టు ప్రాంతాలే. తిరుమల కొండల్లోనుంచి జాలువారి వచ్చే వర్షపు నీరంతా బాలాజీ, మల్లిమడుగు, కల్యాణి డ్యాం రిజర్వాయర్లకు మళ్లించేలా ప్రణాళికలు రూపొందించాలని, నగరం మరోసారి ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇక బెనిఫిట్ షోలు లేవు

విజయవాడ, నవంబర్ 24, (న్యూస్ పల్స్)సినిమాటోగ్రఫీ చట్ట సవరణ బిల్లును సభలో మంత్రి పేర్ని నాని ప్రవేశపెట్టారు. ఈ బిల్లకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి పేర్ని నాని కీలక కామెంట్స్ చేశారు. థియేటర్‌లో రోజూ 4 ఆటలు వేయాల్సింది.. పది నుంచి 12 షోలు వేస్తున్నారని పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో ఏమి చేసినా ఎవరూ పట్టించుకోరు అనే ఉద్దేశంతో కొందరు ఉన్నారని చెప్పుకొచ్చారు. బలహీనతలు సొమ్ము చేసుకునే వ్యవస్థను కట్టడి చేసేందుకు ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు అమ్మితేనే దోపిడీ అరికట్టగలమని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ధారించిన సమయంలోనే షోలు ప్రదర్శించాలని తేల్చి చెప్పారు. పరిశ్రమ ప్రభుత్వ నిబంధనలకు లోబడే నడుచుకోవాలన్నారు. ఇష్టానుసారంగా నడుచుకునే అవకాశం ఇవ్వమని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు సినిమా చూసేలా మధ్యతరగతి వారి కోసం కొత్త విధానం తీసుకొచ్చినట్లు మంత్రి పేర్ని నాని తెలపారు. టాక్స్‌ల విషయంలో కూడా స్పష్టత ఉండటం లేదని? టాక్స్‌ల విషయంలో ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించకుండా ఉండేందుకు కూడా ఆన్ లైన్ విధానం ఉపయోగపడుతుందని వెల్లడించారు.తక్కువ రేటుకు ప్రజలకు వినోదంతో పాటు ప్రభుత్వానికి టాక్స్‌ల రూపంలో ఆదాయం సరిగ్గా వస్తుందని మంత్రి వెల్లడించారు. సినిమా డిస్ట్రిబ్యూటర్స్ ప్రభుత్వంపై నిందలు వేస్తే అర్థం ఉంటుంది కానీ, ఒక రాజకీయ పార్టీ ప్రభుత్వంపై బురద వేయడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు, ఒక వర్గం మీడియాపై పేర్ని నాని సెటైర్లు వేశారు. ప్రభుత్వం అప్పుల కోసం ఈ విధానం తీసుకొస్తున్నట్లు ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. బస్సు, రైలు టిక్కెట్లు ఆన్‌లైన్‌లో తీసుకోవడానికి లేని అభ్యంతరం సినిమా టిక్కెట్లపై ఎందుకు? అని ప్రశ్నించారు. అత్యంత సౌలభ్యకరంగా సినిమాను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. డబ్బులు పోగు చేసుకోవాలని?అప్పులు తేవాలని ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేవారు. క్యూలైన్‌లో నిలబడే అవసరం లేకుండా?టిక్కెట్లు తీసుకోవచ్చని తెలిపారు.ఇక నుంచి ఏపీ సినిమా హాళ్లలో కేవలం నాలుగు షోలో ఉంటాయని మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. అదనపు షోలకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. చిన్న సినిమా,పెద్ద సినిమా తేడా లేదని?కేవలం నాలుగు షోలు మాత్రమే ప్రదర్శించేందుకు అనుమతిస్తామన్నారు. అన్ని సినిమాలకు ఒకే టికెట్ రేట్ ఉంటుందని వెల్లడించారు. గతంలో పెద్ద హీరో సినిమాలకు 200 నుంచి 500 రూపాయలకు పైగా అమ్మిన పరిస్థితి ఉందని.. ఇప్పుడు అలాంటి పద్దతులు కుదరవన్నారు.కాగా రాబోయే ఆరు నెలల్లో పెద్ద హీరోల భారీ బడ్జెట్ సినిమాలు విడుదల అయ్యేందుకు సిద్దంగా ఉన్నాయి. ఏపీ సర్కార్ నిర్ణయంతో.. ఆర్.ఆర్.ఆర్, ఆచార్య, పుష్ప, భీమ్లా నాయక్ సినిమాలపై ప్రభావం పడనుంది

# తమాషా చేస్తున్నావా?.. డ్యూటీ అంటే లెక్కలేదా?



కణేకల్లు: 'ఏం తమాషా చేస్తున్నావా? డ్యూటీ అంటే లెక్క లేదా? పని చేయాలనుకుంటున్నావా? లేదా? డ్యూటీ పట్ల ఇంత నిర్లక్ష్యమైతే ఎలా?' అంటూ కణేకల్లు రెండో సచివాలయ ఏఎన్ఎం పర్థమ్మపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ సిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కణేకల్లు రెండో సచివాలయాన్ని జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల గురించి ఏఎన్ఎం పర్థమ్మతో ఆరా తీశారు. ఆమె సరైన సమాధానం ఇవ్వకపోవడంతో రికార్డులు పరిశీలించారు. అందులో ఎలాంటి సమాచారాన్ని నమోదు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వెంటనే డీఎంహెచ్ఓ డాక్టర్ కామేశ్వరరావుకు ఫోన్ చేసి సచివాలయ ఏఎన్ఎంల పనితీరుపై పర్యవేక్షణ

**ఏఎన్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ సిరి**

**సచివాలయ ఏఎన్ఎంపై జేసీ డాక్టర్ సిరి ఆగ్రహం**

లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు.నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న పర్థమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సరైన సమాధానాలు ఇవ్వని మహిళా పోలీస్‌పై మండిపడ్డారు. పనితీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులను ఆమె హెచ్చరించారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట సర్పంచ్ నిర్మల, వైస్ సర్పంచ్ నబీషా, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ గూడెన్న, ఈఓ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.బెళుగుప్ప: సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్యోగులకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ సిరి సూచించారు. బెళుగుప్ప మండలం హనిమరెడ్డిపల్లి సచివాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కాలువపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. పండ్ల తోటల పెంపకం వల్ల దీర్ఘకాలిక దిగుబడులు సాధించే అవకాశమున్నందున సన్న, చిన్న కారు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముస్తాఫాకమాల్ బాషా, ఏపీఓ కృష్ణమూర్తి, వీఆర్ఓ చంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొండపల్లిలో దేవినేని ఉమా ఓవరాక్షన్..



అమరావతి: కృష్ణా జిల్లా కొండపల్లి మునిసిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను బుధవారం నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అసిస్టెంట్ ఎన్నికల అధికారికి అనుమతినివ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)ను ఆదేశించింది. అయితే ఎన్నిక ఫలితాన్ని మాత్రం వెల్లడించవద్దని న్యాయస్థానం నిర్దేశించింది. ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో విజయవాడ ఎంపీ వినియోగించుకునే ఓటు ఈ వ్యవహారంలో కోర్టు వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని పేర్కొంది.ఎన్నిక ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేసి పూర్తి వివరాలను తమ ముందుంచాలని స్పష్టం చేసింది. టీడీపీ వార్డు సభ్యులకు తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీసు కమిషనర్ (ఇన్‌చార్జ్) జి.పాలరాజుకు సూచించింది. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండపల్లి మునిసిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు సంబంధించి తదుపరి ఎలాంటి వాయిదాలకు ఆస్కారం లేకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ టీడీపీ వార్డు సభ్యులు, ఎంపీ కేశినేని నాని, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన కె.శ్రీలక్ష్మి అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది ఎన్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ 'కోరం' ఉన్నప్పటికీ దురుద్దేశపూర్వకంగా ఎన్నికను వాయిదా వేస్తున్నారని నివేదించారు.సభ్యులందరికీ ముందస్తు నోటీసు తప్పనిసరివిచారణ సందర్భంగా కోర్టు ఆదేశించినా ఎన్నికలు నిర్వహించరా? అంటూ అధికారులపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక

**750మంది పోలీసులతో భద్రత**

కొండపల్లి ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఇవాళ ఉదయం నిర్వహించనున్నారు. గత రెండు రోజులుగా ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు బారికేడ్లు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. నిన్న 400 మంది కార్యాలయం ప్రాంగణంలో పహారా ఉండగా ఇవాళ 750 పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు కోర్టును ఆశ్రయించిన టీడీపీ కౌన్సిలర్లు, స్వతంత్ర అభ్యర్థి కె.శ్రీలక్ష్మి, ఎంపీ కేశినేని నానికి పోలీసు భద్రత కల్పించాలని విజయవాడ ఇంఛార్జి పోలీసు కమిషనర్ జి.పాలరాజుకు కోర్టు నిన్న స్పష్టం చేసింది. ఛైర్మన్, వైస్ఛైర్మన్ ఎన్నికను నిర్వహించాలని.. కానీ ఫలితాలు ప్రకటించొద్దని ఆదేశించింది. ఎంపీ కేశినేని నాని ఓటు వినియోగం ఈ వ్యాజ్యంలో తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అనంతరం విచారణను ఈనెల 25కు వాయిదా వేసిన విషయం తెలిసిందే.

# భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత

విశాఖపట్నం విశాఖ ఏజెన్సీ పాడేరు డివిజన్ కేంద్రం లో ఉన్న కస్తూరిబాయి గాంధీ విద్యాల యం లో విద్యార్థులు రాత్రి భోజనం తిని అస్వస్థతకు గురయ్యారు.దీంతో డ్యూటీలో ఉన్న సిబ్బంది అస్వస్థతకు గురైన విద్యార్థులకు స్థానిక జిల్లా ఆస్ప త్రికి తరలించి వైద్య సేవలు అందిస్తు న్నారు.పాఠశాల నిర్వాహకులు నిర్ల క్ష్యం కారణంగా కలుషిత ఆహారం తీసుకోవడంతో విద్యార్థులు అస్వస్థ తకు గురయ్యారని వైద్యులు తేల్చా రు.ఆహారంతో పాటు తాగునీటి కలు షితం మలినలు ఉన్నట్లు వైద్య బృం దం తెలిపారు.దీనిపై ఉన్నతాధికారు లు స్పందించి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించి దీనికి బాధ్యు లైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల ని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తు న్నారు.

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 30 నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు జరుగనున్న వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యం లో నవంబరు 23వ తేదీ కోయిల్ ఆ ళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగిం ది.ఈ సందర్భంగా సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామా ర్చన, శుద్ధి నిర్వహించారు.అనంతరం ఉదయం 6 నుండి 9 గంట ల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమం జనం జరిగింది.ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసా మగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.అనంతరం ఉదయం 9.30 గంటల నుండి భక్తుల ను దర్శనానికి అనుమతించారు.

# టీడీపీ మహిళల నిరసన

విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ అధినే త చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వైకాపా మంత్రులు,శాసన సభ్యులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరస నగా టీడీపీ మహిళ కార్యకర్తలు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు.మహిళకు రక్ష ణ కల్పించాల్సిన మంత్రులే నోటికి వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు.వైసిపి ప్రభు త్వంలో మహిళకు రక్షణ లేకుండా పో యిందని అన్నారు.విశాఖ టీడీపీ కా ర్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరస న వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులే వీధి రౌడీల్లా మాట్లాడితే ప్రజలు ఎవరితో చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశా రు.టిడిపి మహిళ కార్యకర్తలకు విజ యసాయి రెడ్డి,జగన్మోహన్ రెడ్డి, అంబ టి రాంబాబు,కొడాలి నాని ల మాస్కు లు ధరించి వారికి హాఫ్ శారీ ఫంక్షన్ నిర్వహించి నిరసన తెలిపారు.భువనే శ్వరిదేవి ప్రభుత్వం క్షమాపణ చెప్పే వరకు తమ నిరసన తెలియజేస్థామని టిడిపి మహిళ నేతలు హెచ్చరించారు.

# శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విరాళంగా బంగారు వడ్డాణం

చిత్తూరు దక్షిణ కాశీ గా పేరుపొందిన కాళహస్తీశ్వర ఆలయానికి తిరుపతి వాస్తవ్యులు వజ్రాల చంద్రబాబు, లక్ష్మీనారాయణ దంపతులు బంగారు వడ్డాణం ఆలయ కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు కు అందించారు. అనంతరం ఈవో పెద్దిరాజు ఆదేశాలతో విరాళం అందించిన దాతలకు స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో తనపాల్, విజయ సారది ఆలయ ప్రోటోకాల్ సూపరిండెంట్ నాగభూషణం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్

గోనెగండ్ల నవంబర్ 24 గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధులను 15 వా ఆర్థిక విధులు 965 కోట్లు వైసిపి రాష్ట్ర ప్రభుత్వం పక్కదార దారిమళ్లించిందని విద్యుత్ చార్జీలుకు చెల్లింపు అనుమతి లేకుండానే కట్ పంచాయతీ నిధులు గ్రామ సర్పంచ్ హైమవతి ,చంద్రశేఖర్, వార్డు సభ్యులు అక్బర్, నాగప్ప, సజ్జల హసీన, వంకాయల కాజబీ,జీలాని భాష,అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో స్థానిక పంచాయతీ కార్యలయం ఎదుట సర్పంచ్, వార్డు సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14,15,ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంది.నిన్నటి మొన్నటీ వరకూ గ్రామ పంచాయతీ ఖాతాల్లో వేల రూపాయలు ఉండగా ఆధివారానికి జీరో బ్యాలెన్స్ చూపిస్తోంది. వెచ్చించి పనులు చేసిన సర్పంచ్ లు కాంటాక్ట్ ర్లకు, ఇంకా బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. కావునా రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న 14,15,ఆర్థిక సంఘం నిధులు తిరిగి వారి పంచాయితీ ఖాతాల్లో జమచేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమం లో సాగునీటి సంఘం అధ్యక్షులు దరగలమాబు దరగలమాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విద్యా హక్కును కాలరాస్తున్న భాష్యం స్కూల్



ఎమ్మిగనూరు నవంబర్ 24,( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలోని భాష్యం స్కూల్ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండ ధనమే ధ్యేయంగా భావిస్తూ జీవో 53ను తుంగలో తొక్కి విచ్చల విడిగా ఫీజులను వసూలు చేస్తున్న భాష్యం స్కూల్ ను సీజ్ చేయాలనీ యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఇండియా యు ఎస్ ఎఫ్ ఐ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ స్టూడెంట్స్ ఫెడరేషన్ డిమాండ్.బుధవరం డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు ఉదయ్, సురేష్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని భాష్యం స్కూల్ సరైన మౌలిక సదుపాయాలు లేవు జీవో 53 ను పాటించకుండా ఫీజుల బోర్డ్ పెట్టకుండా విద్యార్థి తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలకు వేలు ఫీజులను వసూలు చేస్తున్నారు. పక్క బిల్డింగ్ లేక అదే భవనాలలో విద్యను బోధిస్తూ, కాలక్షేపం చేస్తు విద్యార్థులకు సరిపడే గదులు లేక పక్క పక్కనే కూర్చుని బెడుతు కరోనా నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థులకు గ్రౌండ్ ఫెసిలిటీస్ లేకుండా మున్సిపల్ ఫైర్ అనుమతులు లేకుండా విద్యార్థులను మోసగిస్తున్నారు అన్నారు భాష్యం స్కూల్ ను వెంటనే సీజ్ చేయాలనీ విద్యార్థి సంఘాలుగా కోరుతూ, లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాలు చేపడతాం అని హెచ్చరించారు. కార్యక్రమంలో యు ఎస్ ఎఫ్ ఐ నాయకులు రాజ్ కుమార్ ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు

# వక్ఫ్ బోర్డు ఆస్తులపై అవినీతికి బీజం వేసిన తహసీల్దార్



నంద్యాల నవంబర్ 24,( విభారె): :- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు ఓ ప్రకటనలో వామపక్ష మైనార్టీ సంఘాల ఆవాజ్ జిల్లా కన్వీనర్ మస్తాన్ వలి. ఇన్సాఫ్ డివిజన్ కమిటీ షరీఫ్ భాష. పిడియస్ యు జిల్లా

## తాహశీల్దారు అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
## ఆవాజ్ కమిటీ ఇన్సాఫ్
## పీడియస్ యు డిమాండ్

కార్యదర్శి యస్ యమ్ డి రఫీ. మాట్లాడుతూ నూనెపల్లె పరిధిలో వక్ఫ్ బోర్డు ఆస్తులను నంద్యాల తాసిల్దార్ గా ఉన్న రవి కుమార్ తన స్వార్థం కోసం అవినీతికి బీజం వేశారని మండి పడుతున్నారు. ఈ విషయం పత్రికల్లో రాకుండా ఉండేందుకు కొంతమంది విలేకరులకు కూడా అవినీతిలో భాగస్వాములుగా తాహశీల్దారు చేసారని పలువురు అనుకుంటున్నారని తెలిపారు . ఈ విషయం పై కూడా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేద మద్య తరగతి ప్రజలకు తహసీల్దార్ న్యాయం చేయడం లేదని విమర్శించారు. సంపన్నులకు మాత్రమే వక్ఫ్ బోర్డు ఆస్తులను ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డు స్థలాలలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని ఇవి అధికారులకు కంటికి కనపడలేదా అని అన్నారు. జిల్లా అధికారులు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారు. జెండాలను పాతి ఇవి వక్ఫ్ బోర్డు ఆస్తులని ఏవరు కూడా కొనవద్దని ప్రకటనలు చేస్తారే తప్ప ఆచరణలో మాత్రం శూన్యం అన్నారు . వారు వెనుదిరిగిన వెంటనే వక్ఫ్ బోర్డు ఆస్తులను సేంట్ల ప్రకారం విక్రయాలు తహసీల్దార్ కార్యాలయం లోనే జరుగుతున్నాయని తెలిపారు. 74 ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులను అధికారుల నిర్లక్ష్యం అవినీతికి ఆస్కారం ఇవ్వడం వల్ల అవి ఇప్పుడు 30 ఎకరాలకు దిగజారాయని అన్నారు. అవి కూడా కొద్ది రోజులలో కనుమరుగు అవుతాయని అన్నారు . నంద్యాల తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు తహసీల్దార్ ఎన్ని పట్టాలు పంపిణీ చేశారో ఎవరేవరికి ఇచ్చారనేది పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. లేని పక్షంలో సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. తహసీల్దార్ అవినీతి గురించి ప్రజలకు తెలిసే విధంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలు మరువలేనివి.

## ఎస్సై వేణుగోపాల రాజు

మంత్రాలయం నవంబర్ 24,( విభారె): దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించిన వీర సైనికుల త్యాగాలు మరువలేనివని మంత్రాలయం ఎస్సై వేణుగోపాల రాజు పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం దేశం లోపల మనమంతా ఇంత స్వేచ్ఛగా సంతోషంగా జీవించగలుగుతున్నాం అంటే మన దేశం అంచున ఎండ వాన ,చలోని సైతం లెక్కచేయకుండా శత్రువుల తూటాలకు భయపడకుండా ధైర్యంగా ఎదురు నిల్చొని, కుటుంబాలకు సైతం దూరంగా ఉండి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశాన్ని దేశ ప్రజలను కాపాడుతున్న సైనికుల త్యాగాలు ఎంతో గొప్పవి అని కొనియాడారు. దేశ రక్షణలో అమరులైన వీర సైనికులకు వారి కుటుంబాలకు మనం ఏమిచ్చినా ఎంత చేసిన వారి ఋణం తీర్చుకోలేనిది అని పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ పరిమళ విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన ప్రోగ్రాంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్సై వేణుగోపాల రాజు బహుమతులను ప్రధానం చేశారు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు అమర వీరుల గురించి వ్యాఖ్యానం చేశారు.అందులో చక్కని నైపుణ్యంతో వ్యాఖ్యానించిన విద్యార్థులకు ఎస్సై వేణుగోపాల రాజు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పిఈటి మాస్టర్ వెంకటేశ్వర్లు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళిత ఎమ్మెల్యేలు, మంత్రులు జగన్ భజన చేయడం తగదు

## ఏపి ఎమ్మార్పీఎస్ తీవ్ర విమర్శ

మంత్రాలయం నవంబర్ 24,( విభారె): రాష్ట్రంలో ప్రజలు దళితుల సమస్యలు అభివృద్ధి గురించి ఎమ్మెల్యేలు మంత్రులు మాట్లాడకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భజన చేయడం ఏంటని ఏపీ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు పందికోన ఈరన్న,మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు నేపాల్ ఆంధ్రరాష్ట్ర ఎమ్మెల్యేలు మంత్రుల తీరును తీవ్రంగా తప్పు పట్టారు. విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశంలో భాగంగా యస్సీ.,యస్టీ సమస్యలపై అభివృద్ధి - సంక్షేమాలపై స్వల్ప కాలిక చర్చలో భాగంగా...రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న దళితుల సమస్యలపై అభివృద్ధి సంక్షేమంపై చర్చించాల్సిన. దళిత ఎమ్మెల్యేలు మంత్రులు దళితుల సమస్యలను పక్కనబెట్టి సీఎం జగన్ గారికి భజన చేయడం ఎంత మాత్రం సమంజసం అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో దళితులు ఉన్నత రాజకీయ పదవులు అలంకరించినప్పటికీ అధికారం మాత్రం కొంతమంది బడా రాజకీయ నాయకుల చేతిలో అధికారం కేంద్రీకృతం అయ్యిందని విమర్శించారు. ముఖ్యంగా చేపట్టిన ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన అప్పటినుండి ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట దళిత గిరిజనుల మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ,ఇందుకు ఉదాహరణాకు నంద్యాల లో బీటెక్ విద్యార్థి దళిత సోదరి హత్య గావించడం, అదేవిధంగా గుంటూరు జిల్లాలో రమ్య హత్యగావించడం, ఆంధ్రప్రదేశ్లో దళిత మహిళలకు రక్షణ లేదని అర్ధమవుతుంది. గత ప్రభుత్వంలో ఎస్సీలకు అభివృద్ధి కొరకు పెద్దపీట వేయడం జరిగిందని ,ఎస్సీ కార్పొరేషన్లు దళితవాడులో రోడ్లులు డ్రైనేజీలు అనేకం వేయడం జరిగిందని ,. అయితే ప్రస్తుత ప్రభుత్వం లో ఎస్సీ కార్పొరేషన్ నిధులు ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాలకు నిధులు మళ్ళించడం తగదు.ముఖ్యంగా దళిత ఎమ్మెల్యేలు మంత్రులు వీటి గురించి ప్రస్తావించకుండా. దళిత జాతి ప్రయోజనాలను డా.బిఆర్. అంబేద్కర్ గారి ఆలోచనలను వమ్ము చేస్తున్నారు.

## పోలవరం ప్రాజెక్టుపై ఉన్నతాధికారుల సమీక్ష

ఏలూరు కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ కుమార్ ,పోలవరం ప్రాజెక్టు అథారిటి ఛైర్మెన్ ఏకె. ప్రధాన్ ఇతర అధికారులు పశ్చిమగోదావరి జిల్లా పోలవరం లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ,ముంపు గ్రామాలు ,నిర్వాసితులకు నిర్మిస్తున్న కాలనీల మ్యాప్ లను పరిశీలించారు. పోలవరం ప్రాజక్టం సూపరింటెండెంట్ ఇంజినీర్ సుధాకర్ బాబు ప్రాజెక్టులో ఇప్పటి వరకు చేపట్టిన పనులను వివరించారు.

# 'ఫ్యామిలీ మ్యాన్' దర్శకులతో సమంత లేడీ ఓరియెంటెడ్ మూవీ..?



దక్షిణాది అగ్ర కథానాయిక సమంత.. తన భర్త నాగచైతన్య నుంచి విడిపోయిన తర్వాత పూర్తిగా తన కెరీర్ పైనే ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలను మర్చిపోవడం కోసం వరుస ప్రాజెక్ట్స్ కు సైన్ చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో బాలీవుడ్ లోనూ అడుగుపెట్టడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోందని సమాచారం.ఆదివారం జరిగిన ఐఎఫ్ఎఫ్ఐ ఈవెంట్ లో సమంత 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వెబ్ సిరీస్ గురించి మాట్లాడుతూ.. అవకాశం వస్తే బాలీవుడ్ ప్రాజెక్ట్స్ లో నటించాడని రెడీ అంటూ తన మనసులోని మాట బయటపెట్టింది. "మంచి స్క్రిప్ట్ వస్తే తప్పకుండా బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తాను. నాక్కూడా హిందీ సినిమాలు చేయాలనే ఆసక్తి ఉంది. నార్త్ ఇండస్ట్రీకి సౌత్ కు పెద్ద తేడా ఏమీ లేదు" అని సామ్ అభిప్రాయపడింది."నిజం చెప్పాలంటే సినిమా ఓకే చేయడంలో భాష అనేది సమస్య కానే కాదు. ఏదైనా ప్రాజెక్ట్ ఓకే చేసే ముందు.. కథలో విషయం ఉందా లేదా? ఆ కథకు నేను సెట్ అవుతానా? పాత్రకు న్యాయం చేయగలనా? అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను" అని సమంత తెలిపింది. ఇదిలా ఉంటే తాజాగా బీ టౌన్ లో వినిపిస్తున్న టాక్ ప్రకారం సామ్ మరో వెబ్ సిరీస్ చేయడానికి రెడీ అయిందని తెలుస్తోంది.దర్శక ద్వయం రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన 'ఫ్యామిలీ మ్యాన్-2' సిరీస్ తో సమంత డిజిటల్ ఎంట్రీ ఇచ్చారు. రాజీ అనే నెగెటివ్ షేడ్స్ ఉన్న బోల్డ్ పాత్రలో నటించి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సిరీస్ తో నార్త్ ఆడియన్స్ లో కూడా సామ్ క్రేజ్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో రాజ్ & డికె తో కలిసి మరో వెబ్ సిరీస్ చేయడానికి సమంత సిద్ధంగా ఉన్నట్టు టాక్ నడుస్తోంది. ఇప్పుడు స్టార్ హీరోయిన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. మేకర్స్ సరికొత్త వెబ్ సిరీస్ ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు.'రాజ్ డీకే దర్శకత్వంలో సమంత రూత్ ప్రభు ఓ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ చేస్తే ఎలా ఉంటుంది? అమేజింగ్ కాంబో కదా?' అని ఓ నెటిజన్ సామ్ ని ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేసాడు. దీనికి స్పందించిన సమంత స్మైలీ ఎమోజీలను రిప్లై గా ఇచ్చింది. ఈ నేపథ్యంలో 'ఫ్యామిలీ మ్యాన్' సృష్టికర్తలతో ఆమె మరో వెబ్ సిరీస్ చేస్తుందా లేదా మూవీ ప్లాన్ చేస్తుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. త్వరలో సామ్ బాలీవుడ్ ప్రాజెక్ట్ మీద క్లారిటీ వస్తుందేమో చూడాలి.ఇకపోతే విడాకుల ప్రకటన తర్వాత సమంత రెండు తెలుగు తమిళ ద్విభాషా చిత్రాలను అధికారికంగా ప్రకటించింది. అలానే 'పుష్ప' సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ చేయడానికి అంగీకరించింది. సామ్ కెరీర్ లో ప్రత్యేక గీతం చేయడం ఇదే తొలిసారి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందే 'శాకుంతలం' పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటుండగా.. తమిళ సినిమా 'కాతువాకుల రెండు కాదల్' డిసెంబర్ లో విడుదలకు సిద్ధమవుతోంది.

# భోళా చిరంజీవ తమన్నా.. కీర్తి.. జబర్దస్త్ బ్యూటీ

మెగా స్టార్ చిరంజీవి వరుస సినిమాల జాబితాలో భోళా శంకర్ ఒకటి. మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమా ను మెహర్ రమేష్ దర్శకత్వంలో చేస్తున్నాడు. తమిళ హిట్ మూవీ వేదాళంకు ఈ సినిమా రీమేక్ అనే విషయం తెల్సిందే. వేదాళంకు తెలుగు ప్రేక్షకులకు తగ్గట్లుగా మార్చి చిరంజీవి అభిమానులతో పాటు ప్రతి ఒక్కరికి నచ్చే విధంగా దర్శకుడు మెహర్ రమేష్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా లో చిరంజీవికి చెల్లి పాత్రలో కీర్తి సురేష్



నటించబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇక షూటింగ్ ప్రారంభోత్సవం రోజున తమన్నా హాజరు అవ్వడంతో ఆమె హీరోయిన్ గా నటిస్తున్నట్లుగా కన్ఫర్మ్ అయ్యింది. ఇప్పుడు జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ కూడా ఈ సినిమాలో నటించబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం భోళా శంకర్ సినిమాలో రష్మీ గౌతమ్ ఒక ప్రత్యేక పాటలో కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఆ పాటలో కేవలం రష్మీ గౌతమ్ మాత్రమే కాకుండా మరో హీరోయిన్ కూడా కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. మాస్ ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యేలా ఒక మంచి కాన్సెప్ట్ తో ఆ పాట ఉంటుందని మేకర్స్ నుండి సమాచారం అందుతోంది. భోళా శంకర్ సినిమా ను మాస్ ఆడియన్స్ టార్గెట్ గా రూపొందిస్తున్నారు. భారీ అంచనాలున్న ఈ సినిమాలో చిరంజీవి ని విభిన్నంగా చూపించబోతున్న విషయం తెల్సిందే. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఒక భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. అంతే కాకుండా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీతో ఒక పాట ను కూడా చిత్రీకరించినట్లుగా తెలుస్తోంది.కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ఇటీవల చిరంజీవితో ఉన్న ఒక ఫోటోను షేర్ చేశాడు. భోళా శంకర్ తాజా షెడ్యూల్ లో కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరిస్తారట. ఈ షెడ్యూల్ పూర్తి అయిన వెంటనే చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమా షూటింగ్ లో జాయిన్ అవ్వబోతున్నాడు. గాడ్ ఫాదర్ షూటింగ్ మద్యలో వదిలేసి చిరంజీవి వచ్చాడు. ఆయన స్వల్ప అనారోగ్యం వల్ల ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. ప్రస్తుతం భోళా శంకర్ లో నటిస్తున్న చిరు ఆ తర్వాత గాడ్ ఫాదర్ లో జాయిన్ అవుతాడు. మొత్తానికి ఈ రెండు సినిమాలు సమాంతరంగా చిరు పూర్తి చేయబోతున్నాడు. ఈ రెండు వచ్చే ఏడాదిలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయని మెగా వర్గాల వారు అంటున్నారు.

# ప్రభాస్ చిత్రానికి వర్క్ చేయకపోవడానికి కారణమిదే: థమన్



మ్యూజిక్ డైరెక్టర్ థమన్ గత రెండేళ్లుగా ఎంతటి ఫార్మ్ లో ఉన్నాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. స్టార్ హీరోలు - స్టార్ డైరెక్టర్స్ కు ఫస్ట్ ఛాయిస్ గా మారిపోయిన తమన్.. ప్రస్తుతం డజనుకు పైగా సినిమాలతో బిజీగా ఉన్నారు. చిరంజీవి - నాగార్జున - బాలకృష్ణ - వెంకటేష్ వంటి సీనియర్ హీరోల సినిమాలతో పాటుగా మహేష్ బాబు - పవన్ కళ్యాణ్ - ఎన్టీఆర్ - రామ్ చరణ్ - అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోల చిత్రాలకూ థమన్ సంగీతం సమకూర్చారు. అయితే సంగీత దర్శకుడు ఇప్పటి వరకు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సినిమాకి వర్క్ చేయలేదు. ఇదే విషయంపై థమన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.రాబోయే రోజుల్లో ఖచ్చితంగా ప్రభాస్ సినిమాకు సంగీతం అందించే అవకాశం వస్తుందని థమన్ ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను 'రెబెల్' చిత్రానికి మ్యూజిక్ కంపోజ్ చేయాల్సిందని.. కానీ ఆ ప్రాజెక్ట్ నుంచి బయటకు వెళ్లిపోయానని తెలిపారు. దీనికి కారణం ఆ సినిమాకు డైరెక్టర్ లారెన్స్ సంగీతం అందించాలనుకోవడమే అని వెల్లడించారు. దర్శకుడు మ్యూజిక్ చేయాలని అనుకున్నప్పుడు తను చేసేదేమీ లేదని.. అందుకే బయటకు వచ్చేశానని చెప్పారు. అయితే ప్రభాస్ తో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాని తమన్ మనసులోని మాటను బయటపెట్టారు. అయితే ప్రభాస్ నటించిన 'సాహో' సినిమా మేకింగ్ వీడియోకు థమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అందించారు. మరి త్వరలో సినిమాకు సాంగ్స్ కూడా అందించే ఛాన్స్ దక్కించుకుంటారేమో చూడాలి.ఇకపోతే థమన్ ఈ సందర్భంగా తను సంగీతం సమకూర్చిన అప్ కమింగ్ రిలీజ్ 'అఖండ' సినిమా గురించి పలు ఆసక్తికరమైన విషయాలు చెప్పుకొచ్చారు. "ఇప్పటి వరకు నా బెస్ట్ వర్క్ 'అఖండ'. అది నేను నమ్మకంగా చెప్పగలను. ఈ సినిమా చాలా డిమాండ్ చేసింది. ఇది రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాదు. ఇందులో చాలా సైన్స్ కూడా ఉంది. అఘోర అంటేనే సైన్స్. అఘోర పాత్రల మీద చాలా రీసెర్చ్ చేశాను. పుస్తకాలు చదివాం. ఆ పాత్రలకు తగ్గట్టుగానే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కొట్టాం. చాలా బాగా వచ్చింది. ఈ కథ నెవ్వర్ బిఫోర్ అని.. నెవ్వర్ అగైన్ అని కూడా చెప్పొచ్చు. టైటిల్ సాంగ్ విని బాలయ్య గారు మెచ్చుకున్నారు" అని థమన్ చెప్పారు.'అఖండ' సినిమాకు దాదాపు ఐదారు వందల మంది పని చేశారు. చాలా ప్రయోగాలు చేశాం. కేవలం సింగర్లే 120 మంది వరకు ఉంటారు. సినిమాలో అఘోర పాత్ర ఎంట్రీ ఇవ్వడంతో రేంజ్ మారిపోతోంది. వేరే జోన్ లో ఉంటుంది. సినిమా చూసి మా టీమ్ అంతా కూడా చాలా హైలో ఉన్నామని థమన్ చెప్పుకొచ్చారు.

# ప్రమాదంలో పాండ్యా కెరీర్; ఆల్‌రౌండర్‌ను.. ఏ స్థానంలో బ్యాటింగ్ చేయడానికైనా సిద్ధం!




"నేను ఆల్‌రౌండర్‌ను.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా మూడు విభాగాల్లోనూ రాణించాల్సి ఉంటుంది. నన్ను ఏ స్థానంలో ఆడించినా పర్లేదు. ఒకవేళ తుదిజట్టులో ఉన్నట్లయితే ఆల్‌రౌండర్‌గా నా బాధ్యతను నెరవేరుస్తా" అన్నాడు టీమిండియా యువ క్రికెటర్ వెంకటేశ్ అయ్యర్. న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన టీ20 సిరీస్‌తో ఈ కేకేఆర్ ఓపెనింగ్ స్టార్ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మూడు టీ20 మ్యాచ్‌లలోనూ ఆడే అవకాశం దక్కించుకున్న వెంకటేశ్... బ్యాటర్(4,12 నాటౌట్, 20 రన్స్)గా అంతగా ఆకట్టుకోలేదు. బౌలర్‌గానూ తన మార్కు చూపలేకపోయాడు. ఆఖరి టీ20లో మాత్రం ఒక వికెట్ తీశాడు. అయితే, ఒత్తిడిని జయిస్తే అయ్యర్ అద్భుతాలు చేయగలడని విశ్లేషకులు అంటున్నారు.ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా బౌలర్‌గా విఫలమవుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో అయ్యర్ మంచి ఆప్షన్ అని కామెంట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడిన వెంకటేశ్ అయ్యర్... "ఒక క్రికెటర్‌గా ఎలాంటి సవాళ్లకైనా నేను మానసికంగా సిద్ధంగా ఉన్నాను. ప్రతి పరిస్థితిని ఎదుర్కోవడానికి రెడీగా ఉంటాను. మూడో స్థానం లేదంటే ఐదో స్థానం.. మిడిలార్డర్ లేదంటే లోయర్ ఆర్డర్.. ఎక్కడ బ్యాటింగ్‌కు పంపినా సరే... పరుగులు చేయగలను. బౌలర్‌గానూ నా వంతు పాత్ర పోషించగలను. దేశం కోసం ఆడుతున్నపుడు జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా నన్ను నేను సంసిద్ధం చేసుకుంటాను'' అంటూ జట్టులో తను ఏ పాత్ర పోషించడానికైనా సిద్ధంగా ఉంటానని చెప్పుకొచ్చాడు.

## కివీస్‌తో టెస్టు... సూర్యకుమార్ వద్దు.. శ్రేయస్‌కు చోటు!

### కివీస్‌తో సిరీస్: టెస్టు జట్టును ప్రకటించిన వసీం జాఫర్

ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ 2021-23లో భాగంగా టీమిండియా న్యూజిలాండ్‌తో రెండు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. నవంబరు 25 నుంచి కాన్పూర్ వేదికగా తొలి టెస్టు ఆడేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో గాయం కారణంగా స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ జట్టుకు దూరం కాగా.. అతడి స్థానంలో సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. ఇక ఇప్పటికే తొలి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఓడి టైటిల్‌ను న్యూజిలాండ్‌కు అప్పగించిన భారత్.. మెగా ఫైనల్ తర్వాత కివీస్‌తో ఆడుతున్న తొలి సిరీస్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ తన ఫేవరెట్ ఎలెవన్ టెస్టు జట్టును ప్రకటించాడు. మయాంక్ అగర్వాల్, శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్లుగా ఎంచుకున్న అతడు...

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**